
ప్రజాశక్తి

సోమవారం 25 మార్చి 2024

5

పార్వతీపురం మన్యం



అరకు బిజెపి ఎమ్‌పి అభ్యర్థిగా గీత



ప్రజాశక్తి - పార్వతీపురం

అరకు పార్లమెంటు నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా కొత్తపల్లి గీతను ఆ పార్టీ అధిష్టానం ఆదివారం రాత్రి ప్రకటించింది. గీత 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత ఆమె కులవివాదం కేసును ఎదుర్కొన్నారు. అనంతరం బిజెపి తీర్థం పుచ్చుకున్న ఆమె ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తాజాగా అరకు టిక్కెట్టు దక్కించుకున్నారు.

కమలానికి చోటిస్తే సైకిల్‌కి చేటే



- టిడిపి కంచుకోటకు బీటలు తప్పవా?
- పది అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం
- ఎమ్మెల్యే అభ్యర్థుల్లో గుబులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కమలం కలయికతో సైకిల్‌కు ఎదురీత ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి పునాదులకు బీటలు వారడం ఖాయమంటూ పలువురు విశ్లేషిస్తున్నారు. అందుకు తగ్గట్టే టిడిపి నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన, ఆవేదన వ్యక్తమౌతోంది. పొత్తులో భాగంగా ఇటు విజయనగరం, అటు అరకు పార్లమెంట్ స్థానాలు బిజెపికి కేటాయిస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా భీమవరానికి చెందిన కాశిరాజు, లేదా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ సహా మరోపేరు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం. అటు అరకు ఎంపీ అభ్యర్థిపేరును కూడా బిజెపి అధిష్టానం రెండు మూడు రోజుల్లో తేల్చే అవకాశం ఉందని సమాచారం. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోనే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 10 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాస్తవానికి ఈ రెండు జిల్లాలు టిడిపికి కంచుకోట వంటివి. 1981లో ఆవిర్భావం నుంచి జిల్లాలో టిడిపికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. 1994 సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 12అసెంబ్లీ స్థానాలనూ టిడిపి క్లీన్ స్వీప్ చేసింది. ఆ తరువాత క్రమంగా అసెంబ్లీ స్థానాలు తగ్గిన సందర్భాల్లో కూడా జిల్లా స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించింది. 2014 ఎన్నికల్లోనూ టిడిపివే మెజార్టీ స్థానాలు. అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో భాగస్వామిగా ఉన్నప్పటికీ విభజన హామీలు అమలుకు కృషి చేయకపోవడంతో 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వీచిన వ్యతిరేకగాలిలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి కొట్టుకుపోయింది. అయినప్పటికీ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో టిడిపి బలంగానే ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చాక అనేక నిర్బంధాలు, బెదిరింపులు తట్టుకుని కేడర్ నిలబడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక జిల్లాల్లో టిడిపి పోటీలో దిగలేని పరిస్థితులు ఏర్పడినప్పటికీ, ఇక్కడ దాదాపు అన్ని చోట్లా టిడిపి శ్రేణులు పోటీలో నిలిచాయి. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సర్పంచ్, ఎంపిటిసి స్థానాలు వైసిపికి ధీటుగా వచ్చాయి. చాలా చోట్ల టిడిపి గట్టిపోటీ కూడా ఇచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో తిరిగి టిడిపి ఎప్పటికైనా అధికారంలోకి రాబోతుందా? స్థానికంగా ఉన్న నాయకులే ఎంపీ, ఎమ్మెల్యేలు కాబోతారా అని అని ఎదురు చూశారు.

కానీ, ఆశలు తలకిందులయ్యే విధంగా విజయనగరం, అరకు లోక్ సభ స్థానాలను నామమాత్రంగానైనా ఓట్లు లేని బిజెపికి పొత్తులో భాగంగా కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. గత ఎన్నికల్లో విజయనగరం పార్లమెంట్ బిజెపి అభ్యర్థి పాకలపాటి సన్యాసిరాజుకు కేవలం 7,266 (0.6శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. టిడిపి తరపున ఓడిపోయిన మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజుకు 5,30,382 ఓట్లు వచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీని, అశోక్ వంటి సీనియర్ నేతను పక్కనబెట్టి బిజెపికి, అందులోనూ స్థానికేతర నేతలకు అవకాశం ఇవ్వ జూపడాన్ని తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రానికి మోసం చేసినందన్న బిజెపితో తెగదెంపులు చేసుకుని, తిరిగి పొత్తుపెట్టుకోవడం సబుబు కాదని కొందరు, అసలు ఓట్లే లేని పార్టీకి ఈ రెండు జిల్లాల్లో 10 అసెంబ్లీ స్థానాలను ప్రభావితం చేసే పార్లమెంట్ స్థానాలు కట్టబెట్టడమేమిటని మరికొందరు రగిలిపోతున్నారు.

నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం జనసేనకు కేటాయించడంతో అక్కడ పూర్తిగా సైకిల్ గుర్తే కానరాని పరిస్థితి ఏర్పడనుంది. మరోవైపు, తమ పార్టీ (టిడిపి) ఓట్లతో స్థానిక ఎంపీలుగా బిజెపి నాయకులు అధికారం చెలాయిస్తే ఉత్తరభారతదేశంలో మాదిరిగా కులం, మతంతో ప్రజల మధ్య చిచ్చురేపే ప్రమాదం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రామతీర్థంలో రాముని విగ్రహం శిరస్సును ఖండించిన ఘటనను కూడా మతాల మధ్య చిచ్చురేపేందుకు బిజెపి తీవ్రంగా ప్రయత్నించిందని కూడా తెలుగు తమ్ముళ్లు గుర్తుచేసుకుంటున్నారు. విజయనగరం జిల్లా అంటే మత సామరస్యానికి ప్రతీక. అంటరానితనం వంటి దూరాచారాలకు దూరంగానే ఉంటుంది. కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగావున్న ఉమ్మడి విజయనగరం జిల్లాలో మతోన్మాద అజెండాలతో నిత్యం కలహాలు సృష్టించే బిజెపి బీజానికి అవకాశం కల్పిస్తే టిడిపి కూకటివేళ్లు పెకిలించే ప్రమాదం కూడా లేకపోలేదనే వాదన కూడా వ్యక్తమౌతోంది. యువతరం పేరుతో జిల్లాలోని సీనియర్లను పక్కనెబట్టినప్పటికీ లోక్ సభ స్థానంలో బిజెపికి కట్టబెట్టడం వల్ల మొదటికే మోసం వస్తుందనే తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇవే కారణాలతో మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ ఏకంగా టిడిపి పార్టీకే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి అశోక్ లేదా జిల్లాకు చెందిన టిడిపి నేతలకు అవకాశం కల్పించడమే సరైన మార్గమని చెప్పుకుంటున్నారు. బహుశా అందుకేనేమో టిడిపి పునరాలోచనలో పడినట్లు చర్చ జరుగుతోంది. ఈనేపథ్యం లో విజయనగరం పార్లమెంట్ సీటు తమకు తీసుకొని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి ఇచ్చింది. అరకు నుంచి కొత్తపల్లిగీతను బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. దీంతో విజయనగరంపైనే అందరి చూపు ఉంది.



క్షయరహిత జిల్లాయే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

క్షయ రహిత జిల్లాయే లక్ష్యం

డిఎంహెచ్ఒ జగన్నాధరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. క్షయ వ్యాధిని గుర్తించిన రాక్ చిత్ర పటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ క్షయ అంటు వ్యాధి అని, క్షయ బాధితుడు దగ్గిన, తుమ్మినా గాలి ద్వారా క్రిములు వ్యాపించి ఇతరులకు సోకుతుందని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం ఉండడం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా కఫం పరీక్షలు, ఎక్స్ రే, సిబినాట్, ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేయన్నట్టు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడా ఖరీదైన మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని చెప్పారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడకపోతే మొండి క్షయగా మారే ప్రమాదం ఉందని సూచించారు. మొండి క్షయగా మారినా ప్రభుత్వం 21 నెలల పాటు రూ.2 లక్షల విలువ చేసే మందులు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రజల్లో వ్యాధి లక్షణాలు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. దేశంలో ప్రతి ఏటా లక్ష మంది ప్రజలకు సమారు 200 నుండి 215 మంది క్షయవ్యాధికి గురవుతున్నారని చెప్పారు. ఏడాదికి 3 నుండి 3.5 లక్షల వరకు మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. మరణాలు నియంత్రించేందుకు ప్రభుత్వం వివిధ రకాలుగా అరోగ్య కారక్రమాలు చేపట్టిందని వెల్లడించారు. జిల్లాలో 43 డిజిగ్నేటేడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, 7 టిబి యూనిట్లను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల్లో 2023 జనవరి నుండి డిసెంబరు వరకు 1818 మందికి పాజిటివ్‌గా గుర్తించామన్నారు. అందులో 911 మందికి చికిత్స పూర్తి చేశామన్నారు. జనవరి 2024 నుంచి ఇప్పటి వరకు 230 మందిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. 98.3% మందికి క్షయ వ్యాధి నుంచి విముక్తి కలిగించామని, జిల్లాలో 16 పంచాయితీలను క్షయరహిత పంచాయతీలుగా ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. క్షయ వ్యాధి మందులు తీసుకుంటున్న వారికి నెలకు రూ .500 చొప్పున ఆరు నెలలకు మొత్తం మూడు వేలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. క్షయ బాధితులను దత్తత తీసుకున్న వ్యక్తులు అందిస్తున్న రూ.700తో పౌష్టికాహారం కిట్లు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. పౌష్టికాహారం అందించేందుకు ముందుకు వచ్చే దాతలు జిల్లా క్షయ నివారణ అధికారి వద్ద వివరాలు నమోదు చేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం జిల్లాలో 700మంది పౌష్టికాహారం కిట్లు పొందుతున్నారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారిలో కనీసం 10 నుండి 15 శాతం వరకు కఫ పరీక్షలు చేయాలని ఆదేశించామని చెప్పారు. ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు క్షయరోగులను పరామర్శించి, మందులు వేసుకుంటున్నారో లేదో గమనించడమే కాకుండా ప్రతి రెండు నెలలకు ఒకసారి “కఫ” పరీక్షకు పంపించాలని సూచించామని చెప్పారు. మందులు వాడే రోగులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలని కోరారు. డిపిఆర్ఒ ఎల్.రమేష్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సరైన అవగాహన కల్పించాలని తద్వారా సామాజిక, మానసిక, ఆర్థిక ఒత్తిడి నుండి దూరం చేయవచ్చని తెలిపారు.

ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ యాళ్ల వివేక్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది బాగా పనిచేయడం వల్ల క్షయ వ్యాధి కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయన్నారు. క్షేత్ర స్థాయిలో అంకితభావంతో పని చేసి పూర్తిగా తరిమికొట్టాలని కోరారు. ఈ సందర్భంగా క్షయ అవగాహన కరపత్రాన్ని విడుదల చేశారు. మంచి సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. క్షయ వ్యాధి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ చక్కటి సేవలు అందిస్తూ జిల్లాను ఆరోగ్య మార్గంలో తీసుకు వెలుతున్నందుకు డిఎంహెచ్ఒ జగన్నాధరావుకు వివేక్ దుస్సాలువతో సత్కరించారు. తొలుత క్షయ నిర్మూలనకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివశంకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ నల్లా దుర్గాప్రసాద్, డిఎల్‌ఎటిఒ డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు కొరవడిన స్పష్టత

సందిగ్ధంలో డిప్యూటీ సిఎం ఎస్కార్ట్

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రాష్ట్ర మంతా ఎన్నికల కోడ్ పరిధిలోకి వెళ్ళింది. దీంతో మంత్రులు, డిప్యూటీ సిఎంల భద్రత కుదింపు జరిగింది. దీనిలో భాగంగా డిప్యూటీ సిఎం రాజన్నదొరకు భద్రత తగ్గించారు. ఆయనకు కల్పించిన బుల్లెట్ ప్రూఫ్ కారు కూడా ఇప్పుడు వృథాగా వుంది. ఆయనకు కల్పించిన ఎస్కార్ట్ వాహనాన్ని తొలగించారు. కానీ ఎస్కార్ట్ సిబ్బందిని వుంచారు. ఆ సిబ్బందిని వాడుకోవాలంటే రవాణా ఖర్చులు ఆయనే భరించుకోవాల్సి వుంటుంది. అంటే ఆ ఖర్చు ఎన్నికల వ్యయం పరిధిలోకి వస్తుందని చెబుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బుల్లెప్రూఫ్‌కారు

దీంతో ఆయన ఎస్కార్ట్ సిబ్బందిని వాడుకోవడం లేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించాల్సి ఉంది. ఎఒబి జోన్‌లో ఈ ప్రాంతం ఉండడంతో ఆయనకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. దీనిపై జిల్లా అధికారుల నుంచి ఏ విధమైన దిశానిర్దేశం రాకపోవడంతో రాజన్నదొర ఎస్కార్ట్ సిబ్బంది వినియోగం పై స్పష్టత లేదు. ఇప్పటికే ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జిల్లా అధికారులు స్పష్టత ఇస్తే ఎస్కార్ట్ సిబ్బంది వినియోగం పై నెలకొన్న సందిగ్ధత తొలగిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పెద్దవలసలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ఇండిపెండెంట్‌గా పోటీ యోచనలో రామకృష్ణ



ప్రజాశక్తి - సాలూరు

జనసేన నాయకులు గేదెల రామకృష్ణ ఇండిపెండెంట్‌గా పోటీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.కొద్ది నెలల క్రితం ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. సహకార శాఖలో సబ్ డివిజనల్ కోపరేటివ్ అధికారిగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఆయన జనసేన టికెట్ కోసం ప్రయత్నించారు. అయితే ఇప్పుడైనా అవకాశం దక్కుతుందేమోనని ఉద్యోగానికి రాజీనామా చేశారు. అయితే టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటును టిడిపికి కేటాయించడంతో మరోసారి నిరాశకు గురయ్యారు. ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణిని పార్టీ ప్రకటించింది. జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా సంధ్యారాణి పోటీ చేయనున్నారు. కానీ ఆమె ఇంతవరకు జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేసిన దాఖలాల్లేవు. దీంతో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు కొంత అసంతృప్తితో రగిలిపోతున్నారు. జనసేన కూడా ఎమ్మెల్యే సీటు ఆశించిన గేదెల రామకృష్ణకు ఏం విధమైన దిశానిర్దేశం చేయలేదు. టిడిపి అభ్యర్థి సంధ్యారాణి కూడా జనసేన నాయకులను కలుపుకుని పోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గదబ సామాజిక వర్గానికి చెందిన రామకృష్ణకు నియోజకవర్గంలో ఎక్కువ మంది బంధువులు, స్నేహితులు వున్నారు. దీంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన తన బంధువులు, స్నేహితులతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కొద్దిరోజుల్లో ఆయన తన కార్యాచరణను ప్రకటించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రజా పక్షాన పోరాడేది సిపిఎం మాత్రమే

జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కొమరాడ

మతోన్మాద బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, వైసిపి అభ్యర్థులను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఆదివారం కొమరాడలో సిపిఎం కార్యకర్తల సమావేశం కొల్లి సాంబమూర్తి అధ్యక్షతన జరిగింది. అనంతరం పెద్దవలస, బట్టిమోగమానువలస గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ఆవలంబిస్తున్న విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతకు తీవ్ర నష్టం చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి బిజెపిని బలపరచడం, జట్టు కట్టడం సిగ్గుచేటని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే మూడు వ్యవసాయ చట్టాలను, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్లను బిజెపి తీసుకొస్తే టిడిపి, వైసిపిలు బలపర్చాయనిదుయ్యబట్టారు. సిపిఎం నాయకులు మండంగి రమణ మాట్లాడుతూ మండలంలో ఏనుగుల సమస్య, పూర్ణపాడు వంతెన, తోటపల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతరాష్ట్ర రహదారి మరమ్మతుల సమస్యపై సిపిఎం అన్నివేళలా పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి సందర్భంలో బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను ఓడించి, ప్రజల తరపున నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, నాయకులు బిడ్డిక శంకర్రావు, గిరిజన సంఘం నాయకులు వెంకటేశు, చక్రపాణి, రాజు, మధు, కైలాస్, రైతు సంఘం నాయకులు తాతబాబు, వెంకటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరకు క్రషింగ్ పూర్తి

ఇఐడి ప్యారి అసోసియేట్ ఉపాధ్యక్షులు పట్టాభిరామ్‌రెడ్డి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్‌లో ఆదివారంతో చెరకు క్రషింగ్ పూర్తి అయినట్లు సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు పట్టాభిరామ్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కర్మాగార సమావేశం మందిరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చెరకు క్రషింగ్ 4 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా, 3,92,750 లక్షల మెట్రిక్ టన్నులు పూర్తిచేసినట్లు వెల్లడించారు. గతేడాది 10.02 శాతం రికవరీ రాగా, ఈ ఏడాది 9.09 శాతం రికవరీ వచ్చినట్లు తెలిపారు. ఈ సీజన్ ముందుగా క్రషింగ్ ప్రారంభించినట్లు తెలిప్పారు. చెరకు క్రషింగ్ విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ ఏడాదికి చెరకు క్రషింగ్‌కు సహకరించిన రైతులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వాతావరణం, సాంకేతిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొన్న లక్ష్యాలు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లచ్చయ్యపేట సుగర్స్ నుంచి 9,709, భీమసింగి సుగర్స్ నుంచి 6,632 మెట్రిక్ టన్నుల చెరకు ఆడినట్లు తెలిపారు.

వచ్చే ఏడాది చెరకు క్రషింగ్‌కు 18 వేల ఎకరాలు సాగులో ఉందన్నారు. రైతులు మొక్కజొన్న, వరి వైపు దృష్టిసారించినట్లు తెలిపారు. గ్రామాల్లో చెరకు పంటలపై అవగాహన కల్పించి సాగు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరకు సరఫరా చేసిన రైతులకు వెంటనే బిల్లులు చెల్లించామని తెలిపారు. సమావేశంలో కేన్ జిఎం రాజేంద్రన్, హెచ్ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ, ఫైనాన్షియల్ ఎజిఎం శ్యామ్‌కుమార్ ఉన్నారు.

చెప్పింది కొండంత... చేసింది గోరంత

- ముందుకు సాగని జంపరకోట జలాశయం పనులు
- అర్థాంతరంగా నిలిచిన వీరఘట్టం ప్రధాన రహదారి
- నాలుగున్నరేళ్లలో నియోజకవర్గ పరిస్థితి

ప్రజాశక్తి -పాలకొండ

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి అంతంత మాత్రమే జరిగింది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇంకా అభివృద్ధి చేయాల్సింది కొండంత ఉంది. దీంతో పాలకొండ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అధికార పార్టీకి చెందిన వారైనప్పటికీ నియోజకవర్గంలో పూర్తి స్థాయి అభివృద్ధి చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇందుకు నిదర్శనం తోటపల్లి ఎడమ కాలువ పనులు నేటికీ పూర్తి కాకపోవడమే. ఈ కాలువ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు రాబట్టడంలో స్థానిక ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిధులు మంజూరు కాకపోవడం వల్లే ఈ కాలువ పనులు ప్రారంభించి నాలుగున్నరేళ్లు కావస్తున్నా ప్రస్తుతం కనీసం 20 శాతం పనులైనా పూర్తి కాలేదని, దీంతో పూర్తిస్థాయిలో సాగునీరందక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాలకొండ మండలంలోని శివారు గ్రామాలకు తోటపల్లి ఎడమ కాలువ ద్వారా నీరందకపోవడంతో ఏటా ఖరీఫ్‌లో రైతులు కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది.

ఇదిలా ఉండగా పాలకొండ మండలంలో జంపరకోట జలాశయం పనులకు ఇంత వరకు నిధులు కేటాయించలేదు. గత ఎన్నికల ముందు జంపరకోట జలాశయం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కళావతితో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు కాలేదు. ఈ పనులు పూర్తయితే మండలంలో 2వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని ఎంతో ఆశతో ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. అలాగే భామిని మండలంలో లిప్టు ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన పాలకులు నేటికీ నెరవేర్చలేకపోయారు. దీంతో సాగునీరందక ఆ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని మేజర్ పంచాయతీ అయిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో ఈ పట్టణ వాసులతో పాటు అటు వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గిరిజనులు పండించిన, సేకరించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సీతంపేటలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంటింటికీ కుళాయిలు ఇస్తామని వైసిపి ప్రభుత్వం పాలకొండలో నాన్ అమృత పథకం కింద పనులకు శంకుస్థాపన చేసినా నేటికీ పనులు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.



పనులకు నోచుకోని జంపకోట రిజర్వాయర్ ప్రాంతం



అర్థాంతరంగా నిలిచిపోయిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు

చేసిన అభివృద్ధి అంతంతే...

పాలకొండ నియోజకవర్గంలో కొంత వరకు వైసిపి ప్రభుత్వ హయాంలో కొంత మేరకే అభివృద్ధి పనులు జరిగాయన్న చర్చ జరుగుతుంది. ఇందులో భాగంగా పాలకొండ పట్టణంలో సుమారు రూ.10కోట్లుతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు. పాలకొండ ఏరియా ఆస్పత్రి, సీతంపేటలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు చేపట్టారు. అలాగే కొన్ని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. వీరఘట్టం మండలంలో కిమ్మి, రుషింగి వంతెన నిర్మాణం పూర్తి చేసి రెండు జిల్లాలకు రాకపోకలకు సదుపాయం కల్పించారు.

కోడ్ ఉల్లంఘనపై 'సి విజిల్' కొరడా

- పౌరులకు అందుబాటులో 'సి విజిల్' యాప్
- అందిన ఫిర్యాదుకు 100 నిమిషాల్లో చర్యలు

రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే.. సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు చర్యలు తీసుకునేలా.. ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిది.

– ప్రజాశక్తి, పార్వతీపురం



'సి విజిల్' యాప్ అంటే ?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ సి విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

యాప్‌లో ఇలా రిజిస్టర్ చేసుకోవాలి

ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన 'సి విజిల్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ సెల్ ఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటిపి వస్తుంది. దాన్ని నమోదు చేస్తే 'సి విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

వీటిపై ఫిర్యాదు చేయొచ్చు

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి కోడ్ ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి. వ్యక్తిగత ఫిర్యాదులు చేయడానికి అవకాశం లేదు.

ఫిర్యాదు ఇలా చేయాలి

యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటో, లేదా 2 నిమిషాల వీడియోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

100 నిమిషాల్లో చర్యలు పూర్తి

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. అనంతరం దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సరిహద్దులో ప్రత్యేక నిఘా ఏర్పాటు : ఎఎస్‌పి

ప్రజాశక్తి – కొమరాడ

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎఎస్‌పి సునీల్ షరాన్ అన్నారు. ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రాంతం కూనేరులో గల చెక్ పోస్ట్‌ను ఆదివారం పరిశీలించారు. అనంతరం కెఆర్‌బి పురం, కొమరాడ ఇసుక రీచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నిక నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు. చెక్ పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. మద్యం, డబ్బు, మాదక ద్రవ్యాలు వంటి సామాగ్రి రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక పోస్టులను ఎప్పటికప్పుడు అధికార బృందావనం పర్యవేక్షిస్తూ ఉంటాయని తెలిపారు. ఎన్నికల నియమాలు ఎవరైనా పాటించుకుంటే తప్పనిసరిగా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ప్రతి సామాన్యుడు ఫిర్యాదు చేసేందుకు సివిజన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే ప్రతి పౌరుడు తెలియజేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో నిఘా ఉండాలని స్పష్టం చేశారు. దీంతో పాటు కొమరాడ ఎస్సై నీలకంఠం ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పైపులైన్ లీకవ్వడంతో వృథాగా పోతున్న నీరు

వృథాగా నీరు... పట్టించుకొనే వారు లేరు

ప్రజాశక్తి – వీరఘట్టం

మండలంలోని చిదిమి, పివిఆర్ పురం గ్రామాల మధ్య వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం పైపులైను లీక్ కావడంతో తాగునీరు వృథాగా పోతుంది. దీంతో కింది గ్రామాలకు అరకొరగా తాగునీరు సరఫరా కావడంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైలైన్ ద్వారా తాగునీరు లీక్ కారణంతో రోడ్డంతా బురద మాయంగా మారి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అగ్నిగంగమ్మను దర్శించుకుంటున్న యాత్రికులు

నీలావడి జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

ఆంధ్రా – ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలకు ఎంతో నమ్మకం, భక్తి కలిగిన ఒడిశా రాష్ట్రం బందుగాం బ్లాకు చెందిన నీలావడిలో వెలసిన అగ్నిగంగమ్మ జాతర సోమ, మంగళవారాల్లో అత్యంత వైభవంగా జరగనుంది. జాతరకు ఒడిశా, చత్తీస్గడ్, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఆదివారం నీలావడి జాతరకు పార్వతీపురం నుంచి ప్రత్యేకంగా ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలతో భక్తులు పెద్ద ఎత్తున తరలివెళుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ బడే సత్యనారాయణ తెలిపారు.



జయకృష్ణకు మద్దతు తెలుపుతున్న మండల టిడిపి నాయకులు

జయకృష్ణకే ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వాలి


ప్రజాశక్తి – భామిని

పాలకొండ ఎమ్మెల్యే టికెట్‌ను నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణకు కేటాయించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరరావు తెలిపారు. భామిని మండల కేంద్రంలో టిడిపి నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షులు రవినాయుడు మాట్లాడుతూ టిడిపి అధిష్టానం పాలకొండ ఎమ్మెల్యే టికెట్ జయకృష్ణకు కేటాయిస్తే గెలుపు ఖాయమని, పూర్తి స్థాయి మెజారిటీతో నియోజకవర్గం గెలుపునకు సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక ప్రసాద్, సాకేటి రామారావు, గురిబిల్లి లక్ష్మిపతి, కోరాడ రవణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బక్కుపేటలో టిడిపి సమావేశం

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని బక్కుపేటలో మండల టిడిపి అధ్యక్షులు పంట సత్యం, గోపాల్ నాయుడు సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలనకు చరమగీతం పడాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్రను గెలిపించాలని ఆ గ్రామ పెద్దలను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొట్టాపు అప్పారావు, మండల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల టిడిపి నాయకులు సత్యం, గోపాలనాయుడు

తాగునీరొచ్చేది ఎప్పుడో?

- కోట్లాది రూపాయలతో జల జీవన్ మిషన్ పనులు
- ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్న బోరు బావులు

ప్రజాశక్తి – వీరఘట్టం

ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తాయి. మండలంలో మొదట విడత 13 గ్రామాల్లో రూ.142 లక్షలతో జల జీవన్ మిషన్ పనులు చేపట్టారు. అలాగే రెండో విడతలో భాగంగా 33 గ్రామాల్లో రూ.325 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే యు.వెంకంపేట, చిదిమి, పివిఆర్ పురం, డిపి వలస, హుస్సేన్ పురం, చేబియ్యంవలస, తలవరం, కొంచ, తెట్టంగి, తదితర గ్రామాల్లో పైపులైన్లతో పాటు బోరు బావులు కూడా ఏర్పాటు చేశారు. యు.వెంకంపేటలో బోరు బావికి విద్యుత్తు కనెక్షన్ అమర్చినప్పటికీ వాటిని ప్రారంభించకపోవడంతో బోరు బావితో పాటు ఇంటింటి కుళాయిలకు తాగునీరు సరఫరా కాకపోవడంతో అవి ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్నాయి. అలాగే గడగమ్మ, చిట్టిపూడి వలస, దశమంతపురం, సింధునగరం, మహాదేవివలస, ఎస్.గోపాలపురం, బూరుగ, విక్రమపురం, నడిమికెల్ల, కడకల్ల, చిన్నగోర, గోర కాలనీ, మూలలంక, తదితర గ్రామాల్లో పైప్‌లైన్లతో పాటు కుళాయి పాయింట్లు ఏర్పాటు చేసి బోరు బావులు కూడా తవ్వకాలు జరిపారు. వీటికి ఎటువంటి పరికరాలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా పడి ఉండడంతో వీటి ద్వారా తాగునీరు వచ్చేది ఎప్పుడా అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఆర్భాటంగా తవ్వకాలు జరిపి అర్ధాంతరంగా నిలిపి వేయడం పట్ల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల తీరుపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

గడగమ్మ గ్రామస్తులు నేటికీ తమ గ్రామానికి సమీపానున్న నాగావళి నది వద్దకు వెళ్లి చలమల ద్వారా నీరు తోడుకొని తీసుకువచ్చి గొంతును తడుపుకునే పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా పైప్ లైన్లు ఏర్పాటుతో పాటు రెండు బోరు బావులు తవ్వడంతో ఇకపై నీటి కష్టాలు తప్పుతాయని ఎంతో ఆశపడ్డ గ్రామస్తులకు నిరాశే మిగిలింది. ఇక్కడ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా ఎటువంటి పరికరాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు ఆశలు అడియాశలయ్యాయి. రోజురోజుకు ఎండల ప్రభావం ఎక్కువగా ఉండడంతో బావిల్లో నీరు అడుగంటే స్థితికి చేరుకుంది. దీంతో గ్రామానికి సమీపానున్న పొలాల్లో ఏర్పాటు చేసిన బోరుబావుల నుంచి నీళ్లు తీసుకొచ్చి దాహార్తిని తీర్చుకుంటున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బూరుగలో బోరు బావికి అమర్చి సగంలో వదిలేసిన పైపులు



వీరఘట్టం రెల్లి వీధిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ట్యాంకు

నిరుపయోగంగా పనులు

మండల కేంద్రమైన వీరఘట్టంతో పాటు చిదిమి, గడగమ్మ, యు.వెంకంపేట, బూరుగా తదితర గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పైప్‌లైన్‌తో పాటు ఇంటింటికి కుళాయి పాయింట్లు ద్వారా తాగునీరందించేందుకు వీలుగా కోట్లాది రూపాయలతో పనులు చేపట్టినప్పటికీ వాటి ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో గ్రామంలో కుళాయి పాయింట్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీరఘట్టంలోని రెల్లి వీధి సమీపంలో సుమారు రూ.55లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రావుపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి – గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో జరిగిన సీతారామమందిర పున:ప్రతిష్ట కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హాజరయ్యారు. ఆదివారం జరిగిన ఈ ఉత్సవ ముంగిపోత్సవాలకు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పనాయుడు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ గుల్ల సూర్యప్రకాశరావు, బొబ్బిలి సివిల్ సర్జన్ డాక్టర్ గుల్ల రామ్ నరేష్ ల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి రావుపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ప్రముఖ వైద్యులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు తో పాటు మరో 20 మంది వైద్యులు సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుల్ల అన్నపూర్ణమ్మ, బోను వాగ్దేవి, గుల్ల శంకరరావు, గుల్ల విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం పున: ప్రతిష్టలో పాల్గొన్న రాజన్నదొర

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

పట్టణంలో ఆదివారం ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు స్థానిక లూథరన్ చర్చి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో రెవరెండ్ ఫాదర్ పి.రామారావు అధ్యక్షతన జరిగాయి. పట్టణంలోని ప్రధాన రహదారి గుండా ర్యాలీగా సంఘ సభ్యులు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ రామారావు మాట్లాడుతూ ఏసుక్రీస్తుకు సిలువ వేసే ముందు యూదుల రాజుగా ప్రకటించిన రోజునే మట్టల ఆదివారంగా జరుపుతున్నట్టు తెలిపారు. విశాఖ సెనేడ్ బిషప్ పి. సుదర్శన్ రావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం : మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని స్థానిక లూథరన్ చర్చిలో క్రైస్తవులు పాస్టర్ పి.జీవన్ కుమార్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఈత రెమ్మలు పట్టుకొని ఏసుక్రీస్తు గీతాలు ఆలపిస్తూ వైరిచర్ల కాలనీ, మెయిన్ రోడ్డు, పోలీస్ స్టేషన్ వీధి, శివన్న పేట, పేలస్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మట్టల ఆదివారం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు, డి.జాన్, డి.రాజా రత్నం, కోట సుందరసుదర్శన్, డి.ప్రదీప్, డి.జయకుమార్, డి.మజ్జిబాబు, సండే స్కూల్ పిల్లలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని సోమగండి ఆర్‌సిఎం చర్చిలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. విశ్వాసులంతా మట్టలతో హోసాన్న గీతాలు పాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట విచారణ కర్తలు ఫాదర్ విద్యాసాగర్ మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పలువురు యువతీ, యువకులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



అంటిపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అంటిపేటలో ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని అంటిపేటలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలు ఇచ్చిందని, అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం పథకాలు అందించిందని అన్నారు. అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి ఎంతో చేశానని, కావున తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో బిసి కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతిరావు, మాజీ జెడ్‌పిటిసి కృష్ణమనాయుడుతో పాటు గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి – కురుపాం

ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు 2024–25 విద్యా సంవత్సరమునకు ఇంటర్మీడియట్(ఇంగ్లీష్ మీడియం) ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూప్‌ల్లో ప్రవేశాల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. దరఖాస్తు చేరగోరు అభ్యర్థులు టెన్త్ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించబడునని ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 రుసుం చెల్లించి https://apms.apcfss.in, https://cse.ap.gov.in వెబ్సైట్ ఆన్లైన్లో మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9290452055, 7674858698, 9347492224 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రాష్ ప్రోగ్రాం ద్వారా చేతి పంపుల మరమ్మతులు

ప్రజాశక్తి– పార్వతీపురం రూరల్

మండలంలోని వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా అన్ని గ్రామాల్లో ఉన్న చేతి పంపులు మరమ్మతులు చేపడుతున్నట్లు ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో ఉన్న 581 చేతిపంపుల్లో మరమ్మతులో చేయాల్సివి 166గా గుర్తించామన్నారు. గత 15 రోజులుగా 90 వరకు చేతి పంపులు 13 పంచాయతీల్లో దాదాపు 45 గ్రామాల్లో మరమ్మతులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రూ.5 లక్షలు నిధులు కేటాయించినప్పటికీ అవి పూర్తిగా ఖర్చయ్యాయని, అదనపు నిధుల కోసం అధికారులకు అనుమతి కోసం నివేదించామని తెలిపారు. కార్యక్రమంలో బోర్ మెకానికులు బాబ్జీ, ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి – సీతానగరం

ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో ఇప్పటికీ ధాన్యం డబ్బులు రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో రైతులు డబ్బులు రాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎపిటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక

ప్రజాశక్తి – బలిజిపేట

ఎపిటిఎఫ్ 1938 బలిజిపేట మండల శాఖ అధ్యక్షులుగా చుక్క రాము, ప్రధాన కార్యదర్శిగా కొడిశ రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వెంగాపురంలో ఎంపిపిఎస్ పాఠశాలలో ఎపిటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులతో పాటు మరో 8మంది కార్యనిర్వాహక సమితి సభ్యులుగా, 26 మంది జిల్లా కౌన్సిలర్లుగా, పదిమంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేరాలు ఘోరాలు

నాగావళి కాలువలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి – జియ్యమ్మవలస



మండలంలోని తురకనాయుడువలసకు చెందిన పుచ్చ గోపాల్ (44) అనే వ్యక్తి శనివారం సాయంత్ర తన భార్య పద్మావతితో కలిసి వ్యవసాయ పనులకు పొలం వెళ్లారు. అనంతరం ఆమెను ఇంటికి వెళ్లమని చెప్పి రాత్రి వరకు గోపాల్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, పక్క గ్రామాల్లో వెతికారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఇటుక పంచాయతీ ఇటికగదబవలస సమీపాన తోటపల్లి ఎడమ కాలువలో గోపాల్ శవమై కనిపించారు. గుర్తించిన స్థానికులు జియ్యమ్మవలస పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై అనీష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకై తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన గోపాల్‌కు తండ్రి తవిటియ్య, భార్య పద్మ, కుమార్తెలు వెన్నెల, సిరి ఉన్నారు.

ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి – కురుపాం

అదుపుతప్పి ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన సంఘటన ఆదివారం మండలంలోని చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రాపురం నుంచి శ్రీకుర్మాం ఆలయానికి వెళ్తుండగా కురుపాం మండలం మర్రిమానుగూడ సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బిడ్డిక కృష్ణ, బిడ్డిక శ్రీను, బిడ్డిక సురేష్, మోహనరావు, భారతి, ఆరిక సింగరంకు స్వల్ప గాయాలైయ్యాయి. వెంటనే స్థానికులు 108లో వీరఘట్టం ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందజేసి, పోలీసులకు సమాచారం అందించారు.



ప్రమాదానికి గురైన ఆటో